క్లుప్తంగా

చదువుతోపాటు క్రీడలు అవసరం



విద్యార్థులకు క్రీడా సామగ్రి అందజేస్తున్న లయన్స్ క్లబ్ సభ్యులు

బేతంచెర్ల: విద్యార్థులకు చదువుతోపాటు మానసిక ఉల్లాసానికి, శారీరక ధృడత్వానికి క్రీడలు అవసరం అని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ శైలేంద్ర కుమార్ అన్నారు. శుక్రవారం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థులకు లయన్స్ క్లబ్ అధ్యక్షుడు మధు సుధాకర్ రెడ్డి సహకారంతో క్రీడా సామగ్రి కిట్లను అందజేశారు. సమాజంలో విద్య, వైద్య రంగాల్లో లయన్స్ క్లబ్ అందిస్తున్న సేవలను పలువురు కొనియాడారు. కార్యక్రమంలో క్లబ్ సభ్యులు సాంబశివారెడ్డి, వలిబాషా, మనోహర్ రెడ్డి, కేశాలు నాయుడు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాలకు మెడికల్ కిట్లు



సీడీపీఓ కార్యాలయంలో ఉన్న మెడికల్ కిట్లు

బనగానపల్లె రూరల్: అంగన్‌వాడీ కేంద్రాలకు సరఫరా చేయడానికి మెడికల్ కిట్లు శుక్రవారం వచ్చినట్లు సీడీపీఓ ఉమామహేశ్వరమ్మ తెలిపారు. నియోజకవర్గంలో మొత్తం 262 మెయిన్ అంగన్‌వాడీ కేంద్రాలు, 12 మినీ కేంద్రాలకు సంబంధించి ఒక్కో కేంద్రానికి ఒక కిట్టు చొప్పున మొత్తం 274 బాక్స్‌లు వచ్చాయని వెల్లడించారు. మెడికల్ కిట్లలో ముఖ్యంగా హ్యాండ్ శానిటైజర్‌తో పాటు పారాసిటమాల్ సిరప్, చిన్న పిల్లలకు అవసరమైన సిరప్‌లు, అయింట్‌మెంట్స్, కాటన్ మొత్తం 10 రకాల మందులు వచ్చాయన్నారు. వీటిని ఆయా అంగన్‌వాడీ వర్కర్లకు త్వరలో అందజేస్తామని పేర్కొన్నారు.

ఇళ్ల నిర్మాణాల్లో జాప్యం తగదు



లబ్ధిదారుల సమస్యలను తెలుసుకుంటున్న ఈఈ

సంజామల: ఇళ్ల నిర్మాణాలు త్వరితగతిన పూర్తి చేయాలని హౌసింగ్ ఈఈ శ్రీహరి లబ్ధిదారులకు సూచించారు. మండల పరిధిలోని ఆకుమల్ల గ్రామంలో ఉన్న లేఅవుట్లను శుక్రవారం హౌసింగ్ ఏఈ బాల చంద్రుడుతో కలిసి సందర్శించారు. అనంతరం లబ్ధిదారులతో మాట్లడుతూ.. మార్చినెలలోపు ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేసుకోవాలని, లేకుంటే బిల్లులు మంజూరు కావని స్పష్టం చేశారు. సకాలంలో నిర్మాణాలు పూర్తిచేసుకున్న వారికి బిల్లులు మంజూరు అవుతాయని తెలిపారు. అనంతరం లబ్ధిదారుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు.

ఎస్సీ జాబితాలో ఇతరులను చేర్చవద్దని వినతి



డీటీకి వినతి పత్రం అందజేస్తున్న సంఘం నాయకులు

బేతంచెర్ల: ఇతర కులాలను ఎస్సీ జాబితాలో చేర్చవద్దని అంబేడ్కర్ సేవా సమితి జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మేకల నాగరాజు, రూబేన్ అన్నారు. శుక్రవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో డీటీ మారుతికి వినతి పత్రం అందజేశారు. ఇతర కులాలైన మాదాసి, మాదారి కురబలను ఎస్సీ జాబితాలో చేర్చడం సమంజసం కాదని ఆవేదన వ్యక్తం చేశారు. సభ్యులు శ్రీనివాసులు, నాగరాజు, అంజి పాల్గొన్నారు.

ఉత్తమ ఫలితాల సాధనకు కృషి



ఎస్టీయూ క్యాలెండర్లను ఆవిష్కరిస్తున్న ఎంఈఓ

బేతంచెర్ల: ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించడానికి ఉపాధ్యాయులు బాధ్యతగా పని చేయాలని ఎంఈఓ సోమశేఖర్ అన్నారు. గురువారం పట్టణంలోని ఎంఈఓ కార్యాలయంలో ఎస్టీయూ ఉపాధ్యాయ సంఘం 2025 నూతన సంవత్సర క్యాలెండర్, డైరీని ఆయన ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎస్టీయూ నాయకులు నాగేశ్వరనాయక్, నాగరాజు, కృష్ణమూర్తి, నారాయణ, పుల్లయ్య, క్రిష్టారెడ్డి, శివ కుమార్ పాల్గొన్నారు.

డైరీ.. జ్ఞాపకాల తీపి గుర్తులు

- డైరీ రాయడంతో ఎన్నో ప్రయోజనాలు
- స్నేహితులు, బంధువులకు గిఫ్ట్‌గా ఇవ్వొచ్చు
- కాలక్రమేణా ఈ-డైరీలు

గతంలో డైరీ రాయడం దిన చర్యలో ఓ భాగం. తమకు సంబంధించిన ప్రతి విషయం అందులో రాసుకునేవారు. నిజానికి డైరీ రాయడం వల్ల జ్ఞాపకశక్తి పెరుగుతుందట. కొన్ని సంఘటనలు, అనుభవాలు, వాటివల్ల ఎదుర్కొన్న ఫలితాలను పొందుపరచడం వల్ల జీవితంలో కొన్ని సర్దుబాట్లు చేసుకోగలుగుతాం. ఆ అనుభవాలను గుర్తు పెట్టుకోవాలంటే డైరీ రాయడం మంచి అలవాటు. నిద్రలో మనం చాలా విషయాలను మర్చిపోతుంటాం. అయితే డైరీ రాసే అలవాటు ఉన్నవారు నిద్రలో ఉన్నా సరే వారి జ్ఞాపకశక్తి బలంగా ఉంటుందట. అయితే డైరీ చాలామంది రాత్రి వేళ పడుకునే ముందు రాస్తుంటారు. నిజానికి సాయంత్రం పూట డైరీ రాయడం మంచి సమయమట.

కొలిమిగుండ్ల: ఎంతో మంది మహానుభావులు ప్రతి రోజు క్రమం తప్పకుండా డైరీ రాసేవారు. ఆ డైరీలే తర్వాతి తరానికి మార్గదర్శకంగా మారాయి. అయితే ఇప్పుడంతా డిజిటల్ యుగం. తమ దైనందిన జీవితంలో ప్రతి అంశం సోషల్ మీడియాలో పోస్ట్ చేయడానికే ఆసక్తి చూపిస్తున్నారు. డైరీ రాసే వాళ్లలో పాజిటివ్ ప్రభావాలు కనిపిస్తాయి. డైరీ అంటేనే జ్ఞాపకాలను ట్రాక్ చేసుకునేది. రోజు వారీ జీవితంలో జరిగిన విశేషాలను పొందుపర్చడం వల్ల ఆలోచనలను క్రమబద్ధం చేస్తుంది. మన జీవితం అడుగుజాడలను డైరీ పదిలపరుస్తుంది. గోడపై క్యాలెండర్ ప్రతి ఏటా మారిపోతుంది. కానీ 365 రోజులు మనతోనే ఉండిపోతుంది. గత సంవత్సరంలోని ఆలోచన, అక్షరాలను మన ముందు కొత్త సంవత్సరానికి ప్రొగ్రెస్ రిపోర్టు అవుతుంది. పాత ఏడాదిలో నిర్దేశించుకున్న లక్ష్యాలు, సంకల్పాలు, సాధించిన విజయాలు, ఓటములు, ఆగిపోయిన సంకల్పాలను మరోసారి గుర్తు చేస్తాయి.

మార్కెట్‌లో రంగు రంగుల డైరీలు


ప్రతి రోజు డైరీ రాసే అలవాటు పడిన వారి మానసిక ఆరోగ్యానికి సహకరిస్తుంది. గతంలో కంటే ప్రస్తుతం మార్కెట్‌లో రంగు రంగుల డైరీలు అందుబాటులోకి వచ్చాయి. ఇప్పటికే డైరీ రాసే అలవాటు ఉన్న వ్యక్తులు ఏడాది ప్రారంభంలోనే డైరీలు కొనుగోలు చేస్తుంటారు. కొంత మంది న్యూఇయర్ సందర్భంగా స్నేహితులు, బంధువులు, వీఐపీలకు డైరీలను గిఫ్టులుగా ఇస్తుంటారు. విద్యార్థులకు డైరీలు ఎంతోగానో ఉపయోగపడుతాయి. స్నేహితుల గురించి, స్ఫూర్తినిచ్చిన ఉపాధ్యాయుల గురించి రాసుకోవచ్చు. కళాశాలలో జరిగే సరదా సంఘటనలు, గతేడాది విఫలమైన సంఘటనలు గుర్తుండిపోయేలా చేసుకోవచ్చు.

కాలక్రమేణా మార్పులు

ఒకప్పుడు చాలా మందిలో డైరీలు రాసే అలవాటు ఉండేది. సోషల్ మీడియా పుణ్యమా అని డైరీలు రాయడం మానేసి ఏదో ఒక పోస్టు పెట్టి లైక్‌ల కోసం ఎదురు చూస్తుంటారు. గంటల తరబడి సెల్‌ఫోన్ పట్టుకుని సోషల్ మీడియాకు పరిమితమవుతున్నారు. ఆధునిక పరిజ్ఞానం కొంత పుంతలు తొక్కడంతో ఇంటర్నెట్ అందుబాటులోకి వచ్చింది. చాలా మంది ఈ-డైరీలపై ఆసక్తి చూపుతున్నారు. ఎలాంటి వ్యయప్రయాసలకు ఇబ్బంది లేకుండా సురక్షితంగా ఈ-డైరీ ఉపయోగపడుతుంది. పాతబడిపోవడం, చిరగడం వంటి సమస్యలు ఉండవు. కంప్యూటర్, స్మార్ట్‌ఫోన్‌ను ఉపయోగించి ఈ-డైరీ రాసుకునే వారి సంఖ్య పెరిగిపోతుంది. ఈ-డైరీలో పాస్‌వర్డ్ సదుపాయం ఉండడంతో ఇతరులు ఎవరూ వాటిని ఓపెన్ చేసుకునే అవకాశం ఉండదు.

ఇతరుల డైరీ చూడటం మంచిది కాదు

డైరీలో మాటల్లో చెప్పలేని భావోద్వేగాలకు చెందిన అంశాలు, మర్చిపోలేని అనుభూతులు, విషాదకర ఘట్టాలు లిఖించబడి ఉంటాయి. ఒకరి డైరీని మరొకరు చూడటం మంచి పద్ధతి కాదు. కుటుంబ సభ్యులతో పాటు సమాజం అంగీకరిస్తున్న వాస్తవం. కానీ ఆ విషయాలను మరిచి కొందరు చదవడానికి ప్రయత్నిస్తుంటారు. డైరీని జాగ్రత్తగా పెట్టుకోవాలి. వ్యక్తిగతమైనది కావడంతో ఎవరూ చదవొద్దని హెచ్చరించవచ్చు. కుటుంబ సభ్యులు, ఆత్మీయుల గురించి నెగిటివ్ విషయాలు డైరీలో రాయకపోవడం మంచిది. ఎందుకంటే భవిష్యత్‌లో గొడవలు వచ్చే అవకాశాలు లేకపోలేదు. ఇతరుల డైరీ దొరికినా చదవకుండా వాళ్లకు అందించాలి.



ఉపాధి పనులపై సోషల్ ఆడిట్

సంజామల: మండల పరిధిలోని ఆకుమల్ల గ్రామంలో శుక్రవారం సోషల్ ఆడిట్ గ్రామ సభ నిర్వహించారు. 2023-24 సంవత్సరానికి ఎన్ఆర్‌జీసీ కింద మంజూరైన పనులను మూడు రోజులపాటు డీఆర్పీ నాగప్రసాద్ తనిఖీ నిర్వహించారు. చివరి రోజు శుక్రవారం గ్రామ సభలో తనిఖీ విషయాలను వివరించారు. కార్యక్రమంలో హౌసింగ్ ఏఈ బాల చంద్రడు, నాగలక్ష్మమ్మ, సర్పంచ్ వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

బూరుగల సచివాలయానికి ఇంటర్నెట్



ఇంటర్నెట్ సౌకర్యాన్ని ప్రారంభిస్తున్న ఎంపీటీసీ

ప్యాపిలి: మండల పరిధిలోని బూరుగల సచివాలయానికి ఇంటర్నెట్ సౌకర్యం కల్పించారు. డిసెంబర్ 19వ తేదీ బూరుగల గ్రామంలో జరిగిన రెవెన్యూ సదస్సుకు కలెక్టర్ రాజకుమారి హాజరయ్యారు. సచివాలయానికి ప్రింటర్, ఇంటర్నెట్ సౌకర్యం లేకపోవడంతో సేవలు అందటం లేదని గ్రామస్తులు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. కలెక్టర్ ఆదేశాల మేరకు శుక్రవారం ఇంటర్నెట్, ప్రింటర్ సౌకర్యాన్ని ఎంపీటీసీ సభ్యురాలు శివకుమారి ప్రారంభించారు.

అందరి సహకారంతోనే పాఠశాలల అభివృద్ధి



మాట్లాడుతున్న ఎంఈఓలు



సభ్యులకు శిక్షణ ఇస్తున్న ఎంఈఓ వెంకట్రామిరెడ్డి

కొలిమిగుండ్ల: పాఠశాలల అభివృద్ధికి పేరెంట్స్ కమిటీలు కృషి చేయాలని ఎంఈఓలు అబ్దుల్‌కలాం, రాజయ్య పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయ మీటింగ్ హాల్‌లో మండలంలోని పేరెంట్స్ కమిటీలు, హెచ్‌ఎంలకు ఒక్క రోజు శిక్షణ ఇచ్చారు. ప్రతి నెలా నిర్వహించే సమావేశాల్లో పేరెంట్స్ కమిటీలు పాల్గొనాలని సూచించారు. మధ్యాహ్న భోజనం, పాఠశాలలో మౌలిక వసతుల గురించి ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని సూచించారు. మండలంలో మొత్తం 59 పాఠశాలలు ఉండగా సగం మంది కూడా రాకపోవడంతో శిక్షణా శిబిరం వెలవెలబోయింది. వచ్చిన కొంత మంది కమిటీ సభ్యులు, హెచ్‌ఎంలు మధ్యాహ్నానికి వెళ్లిపోయారు.

భాగస్వాములు కావాలి

కోవెలకుంట్ల: పాఠశాల యాజమాన్య కమిటీలు ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధిలో భాగస్వాములు కావాలని ఎంఈఓలు వెంకట్రామిరెడ్డి, వెంకటసుబ్బయ్య సూచించారు. స్థానిక ఎమ్మార్సీలో మండలంలో నూతనంగా ఎన్నికైన కమిటీ చైర్మన్లు, వైస్ చైర్మన్లు, సభ్యులకు శుక్రవారం ఒక్కరోజు శిక్షణా కార్యక్రమం ఏర్పాటు చేశారు. కమిటీల విధులు, బాధ్యతలు, సమావేశాల నిర్వహణ, వంటి అంశాలపై సభ్యులకు అవగాహన కల్పించారు. పాఠశాలల్లో మౌలిక వసతులు, మధ్యాహ్న భోజన పథకం పరిశీలన, తదితర సౌకర్యాలపై తనిఖీలు నిర్వహించాలని పేర్కొన్నారు. డీఆర్‌పీలు విజయ్‌కుమార్ రెడ్డి, ప్రసాదు, గిరీష్‌కుమార్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంఈఓ స్వరూప

ఎస్‌ఎంసీ సభ్యులకు శిక్షణ

బనగానపల్లె రూరల్: స్కూల్‌మేనేజ్‌మెంట్ కమిటీలు పాఠశాలల అభివృద్ధిలో భాగస్వాములు కావాలని మండల విద్యాధికారి స్వరూప, శ్రీనివాసులు సూచించారు. శుక్రవారం స్థానిక జెడ్పీ బాలికల ఉన్నత పాఠశాలలో ఎస్‌ఎంసీ చైర్మన్, వైఎస్ చైర్మన్‌లు, పాఠశాలల హెచ్‌ఎంలకు అవగాహన కార్యక్రమం జరిగింది. వివిధ అంశాలపై శిక్షణ ఇచ్చారు. రిసోర్స్ పర్సన్స్ సత్యనారాయణరెడ్డి, వెంకటేశ్వర్లు, రాజేష్‌గౌడ్ పాల్గొన్నారు.

కలిసికట్టుగా పనిచేస్తేనే అభివృద్ధి సాధ్యం

- పాలక వర్గాన్ని పక్కన పెట్టడం మంచి పద్ధతికాదు
- రాజకీయ కోణంలో కాకుండా అభివృద్ధి కోణంలో చూడాలి
- సర్పంచ్ మెట్ల సరళ



సమావేశంలో మాట్లాడుతున్న సర్పంచ్ మెట్ల సరళ

కోవెలకుంట్ల: ప్రజా ప్రతినిధులు, అధికారులు కలిసికట్టుగా పనిచేస్తేనే మేజర్ గ్రామ పంచాయతీలో అభివృద్ధి సాధ్యమని సర్పంచ్ మెట్ల సరళ, ఉపసర్పంచ్ జీసీఆర్ సూర్యనారాయణరెడ్డి అన్నారు. శుక్రవారం స్థానిక గ్రామ పంచాయతీ కార్యాలయంలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మేజర్ పంచాయతీలో పలు అభివృద్ధి పనులు చేపట్టేందుకు పాలకవర్గం ఏకగ్రీవ తీర్మానం చేసిందన్నారు. పట్టణంలోని బాలకృష్ణ ఆర్చీ నుంచి సంతమార్కెట్ వరకు రోడ్డు విస్తరణ, డ్రైయినేజీ, సీసీరోడ్డు, స్వామినగర్ కాలనీ, ఇందిరమ్మ కాలనీ, ముస్లిం మైనార్టీ కాలనీల్లో ముళ్ల పొదల తొలగింపు, మౌలిక వసతుల కల్పనకు గత గ్రామసభలో తీర్మానం చేశామన్నారు. పనులు చేపట్టే సమయంలో సర్పంచ్, ఇతర వార్డుమెంబర్లకు ఎలాంటి సమాచారం ఇవ్వకుండా ఇన్‌చార్జ్ ఈఓ ప్రకాష్‌నాయుడు పనులు చేయించారని ఆరోపించారు. ప్రజల ద్వారా ఎన్నోకోబడిన ప్రజా ప్రతినిధులకు జవాబుదారీ తనం ఉంటుందన్న విషయాన్ని గుర్తు చేశారు. అభివృద్ధి పనులకు ఎలాంటి ఆటంకం లేకుండా పాలకవర్గం పనిచేస్తోందని, ఈఓ తీసుకుంటున్న ఏకపక్ష నిర్ణయాలపై తమ అభ్యంతరం తెలియజేశామన్నారు. గ్రామ పంచాయతీ అభివృద్ధికి మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి ఇచ్చిన ఆదేశాలను పాటిస్తున్నామన్నారు. గ్రామ పంచాయతీ పాలక వర్గానికి వ్యక్తిగత ద్వేషాలు లేవన్న విషయాన్ని ఈఓ గుర్తించాలని కోరారు. గతంలో జరిగిన విషయాలను పక్కనపెట్టి సమన్వయంతో పనిచేసేందుకు పాలకవర్గం సిద్ధంగా ఉందని పేర్కొన్నారు. వారితో పాటు వార్డుమెంబర్లు నగేష్, రఘు, షరీఫ్, కిషోర్, అమీర్, కమల్, శేషారెడ్డి, సుధీర్‌రెడ్డి, లక్ష్మిప్రసన్న, లక్ష్మిదేవి, శివలీల, సుజాత, గద్దం సావిత్రి, ఉసేన్‌బీ, లీలావతి, పుష్పావతి తదితరులు ఉన్నారు.

వేడుకగా చౌడేశ్వరిదేవి పల్లకీ సేవ



పల్లకీ సేవ నిర్వహిస్తున్న ఆలయ సిబ్బంది

బనగానపల్లె రూరల్: మండలంలోని నందవరం గ్రామంలో వెలసిన చౌడేశ్వరిదేవి ఆలయంలో శుక్రవారం అమ్మవారి పల్లకీ సేవను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఉదయం అమ్మవారికి కుంకుమార్చన, అభిషేకం, ప్రత్యేక అలంకరణ, నైవేద్య సమర్పణ తదితర పూజలు చేశారు. సాయంత్రం అమ్మవారి ఉత్సవ మూర్తిని సుందరంగా ముస్తాబు చేసిన పల్లకీలో కొలువుంచి ఆలయ ప్రాకారంలో ఊరేగించారు. సహస్ర దీపాలంకరణ సేవను సంప్రదాయబద్ధంగా నిర్వహించారు. భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. ఆలయ అసిస్టెంట్ కమిషనర్ కామేశ్వరమ్మ ఏర్పాట్లను పర్యవేక్షించారు.

సావిత్రిబాయి సేవలు చిరస్మరణీయం

- ఘనంగా సావిత్రి బాయి పూలే జయంతి
- నివాళులర్పించిన అధికారులు, నాయకులు



బనగానపల్లె: జెడ్పీ బాలికల ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయినులకు సన్మానం

డోన్/ డోన్ టౌన్: మహిళా విద్యకు పూలబాట వేసిన సావిత్రిబాయిపూలే సేవలు చిరస్మరణీయమని సీనియర్ సివిల్ జడ్జి తంగమణి, బీసీ సంక్షేమ సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి నక్కలమిట్ట శ్రీనివాసులు అన్నారు. సావిత్రిబాయి జయంతిని పురస్కరించుకుని శుక్రవారం స్థానిక గర్ల్స్ హైస్కూల్‌లో పూలే దంపతుల విగ్రహాలను ముఖ్య అతిథులుగా ఆవిష్కరించారు. అనంతరం మహిళా ఉపాధ్యాయులు, కౌన్సిలర్లను సత్కరించారు. పాతపేట జెడ్పీ హైస్కూల్‌లో హెచ్‌ఎం వెంకటసుబ్బారెడ్డి ఆధ్వర్యంలో నివాళులర్పించారు. పశుసంవర్ధక శాఖ కార్యాలయంలో ఏడీఏ నాగరాజు, అసిస్టెంట్ డైరెక్టర్ వసంతలక్ష్మి, పశువైద్యులు పుష్పాంజలి ఘటించారు. టీఆర్ నగర్ ప్రభుత్వ పాఠశాలలో ఇస్రో మాజీ చైర్మన్ సతీష్ ధావన్ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. హెచ్‌ఎం సురేంద్రనాథ్‌రావ్, ఉపాధ్యాయులు అబ్దుల్‌కలాం, సతీష్, మధురవాణి, రఫీ పాల్గొన్నారు. గోసానిపల్లె ప్రభుత్వ పాఠశాలలో సావిత్రిబాయి పూలే జయంతిని నిర్వహించారు. హెచ్‌ఎం వెంకటలక్ష్మి, డాక్టర్ అనుగోరి, రమేష్‌బాబు, సుందర రామయ్య పాల్గొన్నారు. మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్ ప్రసాద్‌గౌడ్, మేనేజర్ హరీఫ్ పూలమాలలు వేశారు.

- **ప్యాపిలి:** స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రిన్సిపాల్ సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో జాతీయ మహిళా ఉపాధ్యాయ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. సావిత్రిబాయి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.
- **సంజామల:** స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో సావిత్రిబాయి పూలేకు ఉపాధ్యాయిని అరుణ కుమారి తదితరలు నివాళులర్పించారు. ఉపాధ్యాయులను సన్మానించారు.
- **బనగానపల్లె రూరల్:** పూలేను ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని ప్రభుత్వ డిగ్రీ కళాశాల మహిళా సాధికారత కోఆర్డినేటర్ డాక్టర్ వసుంధర అన్నారు. స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ మహమ్మద్‌గౌస్ అధ్యక్షతన సావిత్రిబాయి పూలే జయంతిని ఘనంగా నిర్వహించారు. అధ్యాపకులు వరలక్ష్మీ, బడేసాహెబ్, సూర్య నారాయణ రెడ్డి, సీతమ్మ, కౌసల్యదేవి, చంద్రకళ, రామకృష్ణ పాల్గొన్నారు. అలాగే స్థానిక జెడ్పీబాలికల ఉన్నత పాఠశాలలో హెచ్‌ఎం బాలగంగధర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఉపాధ్యాయులను సన్మానించారు.



డోన్: పాతపేట జెడ్పీ హైస్కూల్‌లో పూలే విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు

- **బేతంచెర్ల:** గోరుమానుకొండ ఏపీ మోడల్ స్కూల్‌లో జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఎంఈఓ సోమశేఖర్, ప్రిన్సిపాల్ మరియదాసు మహిళా ఉపాధ్యాయులను సన్మానించారు.
- **అవుకు:** ఎంఈఓలు వెంకటేశ్వర రెడ్డి, శ్రీధర్ రావు ఆధ్వర్యంలో జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ప్రతి ఒక్కరూ ఆమె అడుగు జాడల్లో నడవాలన్నారు.
- **డోన్ రూరల్:** పట్టణంలోని నక్కి రామన్న భవనంలో సావిత్రబాయి పూలే జయంతిని నిర్వహించారు. ఏపీ మహిళా సమాఖ్య నంద్యాల జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ షమీంమ్‌బేగం, అమృత రెడ్డి, మాధవి, సీరిన్, షబాన, మాదవీలత, పద్మావతి, ప్రమీల పాల్గొన్నారు.
- **కోవెలకుంట్ల:** సావిత్రిబాయి పూలేను ఆదర్శంగా తీసుకోవాలని ఎంఈఓ వెంకటసుబ్బయ్య అన్నారు. పట్టణంలోని జెడ్పీ ఉర్దూ ఉన్నత పాఠశాలలో ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం ఆధ్వర్యంలో పూలే జయంతి సందర్భంగా ఆమె చిత్రపటానికి నివాళులర్పించారు. ఉపాధ్యాయినులు పద్మావతి, శేషలక్ష్మి, సుజాత, మల్లేశ్వరమ్మ, శాంతమ్మను సత్కరించారు.



జ్ఞాపికలు అందుకున్న మహిళా ఉపాధ్యాయులు

మహిళా విద్యతోనే సమాజ అభివృద్ధి

- రాయలసీయ వర్సిటీ వైస్ చాన్సలర్ నాయక్

డోన్ టౌన్: మహిళా విద్యతోనే సమాజం అభివృద్ధి చెందుతుందని రాయలసీమ యూనివర్సిటీ వైస్ చాన్సలర్ ఎన్‌టీకే నాయక్ అన్నారు. జాతీయ మహిళా ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం పట్టణంలోని శ్రీవైష్ణవి డిగ్రీ కళాశాల, సిద్ధార్థ జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమాలకు ఆయనతో పాటు డోన్ ఎంఈఓ-2 రామనర్సప్ప ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. సాంఘిక దూరాచారాలను రూపుమాపేందుకు సావిత్రీబాయి చూపిన ధైర్య సహసాలు మరువరానివన్నారు. ఈ సందర్భంగా డిజిటల్ కంప్యూటర్ ల్యాబ్‌లను వారు ప్రారంభించారు. అనంతరం ప్యాపిలి, డోన్ మండలాలకు చెందిన 46 మంది మహిళా హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో కళాశాల గౌరవ అధ్యక్షుడు తూర్పు జయ ప్రకాష్‌రెడ్డి, తెలుగు సాహితీవేత్త తొగట సురేష్‌బాబు, కరెస్పాండెంట్ చంద్రకళాధర్‌రెడ్డి పాల్గొన్నారు.



జూనియర్ కళాశాలలో ఉపాధ్యాయినులకు సత్కారం

మహిళా ఉపాధ్యాయినులకు సత్కారం

జ్యోతిరావు పూలే జయంతిని పురస్కరించుకుని యూటీఎఫ్ రాష్ట్ర ఆడిట్ కమిటీ సభ్యుడు వెంకటసుబ్బారెడ్డి ఆధ్వర్యంలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాల ఉపాధ్యాయినులను సన్మానించారు. అనంతరం యూటీఎఫ్ క్యాలెండర్లను ఆవిష్కరించారు. అలాగే ప్రభుత్వ జూనియర్ కళాశాలలోని అధ్యాపకులను ఎస్ఎఫ్ఐ విద్యార్థి సంఘం నాయకులు సత్కరించారు. ఆయా కార్యక్రమాల్లో గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ గీత, జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ కృష్ణయ్య, ఉపాధ్యాయులు, విద్యార్థి సంఘం నాయకులు తెలుగు విజయ్‌కుమార్, సుబ్బుయాదవ్, లక్ష్మీనాయక్, గోపాల్, ఉమా పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ కార్యకర్తలపై అక్రమ కేసు

అవుకు: మండల పరిధిలోని ఇస్రానాయక్ తండాకు చెందిన వైఎస్సార్‌సీపీ కార్యకర్తలపై అవుకు పోలీసులు అక్రమ కేసులు బనాయించారని శుక్రవారం బాధితులు వాపోయారు. నూతన సంవత్సరం సందర్భంగా తెలుగుదేశం పార్టీకి చెందిన వారు గ్రామంలో బ్యానర్లను ఏర్పాటు చేసుకున్నారు. అయితే పిల్లలకు సెలవుదినం కావడంతో ఆడుకుంటుండగా అదే గ్రామానికి చెందిన కమ్లా నాయక్ అనే వ్యక్తి పిల్లలను గదురుకొని దురుసుగా ప్రవర్తించారు. దీంతో పిల్లలు అతని ఫొటోతో ఉన్న బ్యానర్‌ను రాయితో కొట్టారు. బ్యానర్‌కి రంధ్రం పడింది. దీనిపై అవుకు పోలీస్ స్టేషన్‌లో టీడీపీ కార్యకర్తలు ఫిర్యాదు చేయడంతో విచారించారు. తామే కొట్టామని ఒప్పుకున్నారు. అయితే పోలీసులు మాత్రం పిల్లల తండ్రులపైనే కాకుండా వైఎస్సార్‌సీపీ కార్యకర్తలపై అక్రమంగా కేసులు నమోదు చేశారని బాధితులు వాపోయారు. గ్రామానికి చెందిన వర్యా నాయక్ ఫిర్యాదు మేరకు అదే గ్రామానికి చెందిన మద్దిలేటి నాయక్, రాముడు నాయక్, లక్మా నాయక్, గోవిందు, హనుమా నాయక్, మంగూ నాయక్, కంబగిరి, రాజుపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

యువతి అదృశ్యంపై కేసు నమోదు

బేతంచెర్ల: పట్టణ సమీపంలోని అయ్యల చెర్వులో నివాసం ఉండే యువతి గురువారం ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాకపోవడంతో తల్లిదండ్రులు పోలీస్‌స్టేషన్‌ను ఆశ్రయించారు. వారి ఫిర్యాదు మేరకు అదృశ్యం అయినట్లు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు శుక్రవారం ఎస్ఐ రమేష్ బాబు తెలిపారు.